క్లుప్తంగా

నేడు 'స్పందన'

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 11 గంటల నుంచి నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ దినేష్ కుమార్ ఆదివారం తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంతో అందజేసి సత్వర పరిష్కారం పొందాలన్నారు. స్పందనతో పాటు డయల్ యువర్ కమిషనర్, ఫేస్‌బుక్ లైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

సౌరయాగం ప్రారంభం

సీటీఆర్ఐ: లోక కల్యాణం కోసం నిర్వహిస్తున్న హోమశతచండి సహిత సౌరయాగం ఆదివారం ప్రారంభమైందని యాగ నిర్వాహకుడు వడలి కుమార్ శర్మ అన్నారు. స్థానిక పేపర్ మిల్లు రోడ్డులోని సీతంపేటలో గల యజ్ఞ ప్రాంగణంలో ఈ యాగాన్ని ఈ నెల 26వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి త్రిచన్యాస పూర్వక త్రిచ, మహాసౌర, అరుణ పూర్వక సూర్య నమస్కారాలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 నుంచి చండీసప్తశతి హోమం, సాయంత్రం 6.30 గంటలకు అర్ఘ్య పూర్ణాహుతి, అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో రాజమహేంద్రి విద్యాసంస్థల నిర్వాహకుడు టీకే విశ్వేశ్వర రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

సర్పంచ్ చంటి పరామర్శ

కడియం: మండలంలోని దుళ్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ తోకల వీర వెంకట్రావు ఇటీవల పితృవియోగం పొందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆదివారం మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి వారి కుటుంబాన్ని పరామర్శించారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న శెట్టిబలిజ సంఘ సభ్యులు

ధవళేశ్వరం: బ్లేడ్ బ్యాచ్ సభ్యుడి చేతిలో ఇటీవల హత్యకు గురైన అండిబోయిన రాజేష్ కుటుంబాన్ని ఆదివారం ధవళేశ్వరం శెట్టిబలిజ సంఘ సభ్యులు పరామర్శించారు. ఈ సందర్భంగా రాజేష్ తల్లికి రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిన్నింటి ఏకబాబు, దొమ్మేటి వెంకట సత్యనారాయణ, పెచ్చెట్టి శ్రీనివాసరావు, చప్పిడి ప్రసాద్, పట్నాల జువ్వాలు, కేతా సాయి పాల్గొన్నారు.

సేవలు ఎనలేనివి



ఆదినారాయణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న పూలవర్తకులు

కడియం: నర్సరీ రైతుగా, పూలవర్తక సంఘం సభ్యుడిగా రావిపాటి ఆదినారాయణ అందించిన సేవలు ఎనలేనివని వక్తలు కొనియాడారు. ఆదినారాయణ మృతికి సంతాప సూచకంగా ఆదివారం కడియపులంక పువ్వుల మార్కెట్‌కు సెలవు ప్రకటించారు. పూల వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మార్కెట్ సభ్యులు, పూల రైతులు ఆదినారాయణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.

పదవీకాలం పొడిగింపు



షేక్ షకీలా బేగం

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ రాష్ట్ర ముస్లిం సంచార జాతుల అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ హుకుంపేట గ్రామానికి చెందిన షేక్ షకీలా బేగం పదవీ కాలం మరో రెండేళ్లు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా షకీలా బేగం ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు చెప్పారు.

రోడ్డు నిర్మాణం పరిశీలన


ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్ చిలువూరి సూర్యనారాయణ రాజును ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆదేశించారు. కంబాల చెరువు నుంచి కొంతమూరు గామన్ ఇండియా అండర్ బ్రిడ్జి వరకూ 5.6 కిలోమీటర్ల మేర రూ.3.56 కోట్లతో చేపట్టిన రహదారి నిర్మాణ పనులను ఆదివారం అటుగా వెళుతున్న ఎంపీ భరత్ రామ్ రాజా థియేటర్ వద్ద పరిశీలించారు. ఆరు నెలల క్రితం ప్రారంభమైన పనులు వేగవంతంగా జరగకపోవడంపై కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. నెల రోజుల్లోగా పనులు పూర్తి చేస్తానని కాంట్రాక్టర్ హామీ ఇచ్చారు. ఆర్అండ్‌బీ డీఈ మధుసూదనరావు పాల్గొన్నారు.

అదిరేలా.. అర్బన్ ఫుడ్‌ప్లాజా

- ఆకట్టుకుంటున్న సెట్టింగ్
- విశాలమైన పార్కింగ్
- అందుబాటు ధరల్లో పదార్థాలు
- ఆసక్తి చూపుతున్న నగరవాసులు



అర్బన్ ఫుడ్‌ప్లాజా వద్ద ప్రజల తాకిడి



చెట్టుకు ఏర్పాటు చేసిన లైటింగ్

ప్రకాశం నగర్: నగరంలోని కంబాలచెరువు జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన అర్బన్ ఫుడ్‌ప్లాజా ఎంతో ఆకట్టుకుంటోంది. సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటు చేసిన ఈ ఫుడ్‌ప్లాజాకు నగరవాసులు తరలిరావడంతో ఈ ప్రాంతం సందడిగా మారుతోంది. ఇటీవలే ఎంపీ మార్గాని భరత్ రామ్, జిల్లా కలెక్టర్ కె.మాధవీలత చేతుల మీదుగా ఈ ఫుడ్ ప్లాజా ప్రారంభమైంది. వివిధ రకాల స్నాక్స్, ఐస్‌క్రీమ్స్, ఫాస్ట్‌ఫుడ్ ఐటమ్స్, బిర్యానీ, వివిధ రకాల టిఫిన్లు ఒక్కచోట ఏర్పాటు చేయడం జనం పెద్దసంఖ్యలో ఇక్కడికి తరలివస్తున్నారు.

స్పందన బాగుంది

హోటళ్లతో పోల్చితే అర్బన్ ఫుడ్ ప్లాజాలో ఆహార పదార్థాల ధరలు అందుబాటులో ఉంటున్నాయి. అలాగే నాణ్యత కూడా బాగుంటోంది. దీంతో నగరవాసుల నుంచి మంచి స్పందన వస్తోంది. వీటితో పాటు చెట్లకు అలకరించిన వివిధ రకాల విద్యుత్ దీపాలు, సందర్శకులు కూర్చోవడానికి ఏర్పాటు చేసిన విశాల మైన గ్రానైట్ బల్లలు, పిల్లలను ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేసిన పాండా వంటి బొమ్మలతో ఈ ప్రాంతం ఆహ్లాదభరితంగా ఉంది.

ఫొటోలు, సెల్ఫీలతో మరింత ఉత్సాహం

అర్బన్ ఫుడ్‌ప్లాజాకు చిన్నారులతో పాటు పెద్ద ఎత్తున యువతీ, యువకులు తరలివస్తున్నారు. పచ్చని చెట్లు, రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఆహ్లాదకరంగా ఉన్న ఈ ప్రాంతాల్లో ఫొటోలు, సెల్ఫీలు తీసుకునేందుకు యువత ఉత్సాహం చూపుతున్నారు. అలాగే చిన్నారుల పుట్టిన రోజు ఫొటోలకు ఇక్కడే షూటింగ్ చేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్యకు చెక్

నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ ఫుడ్‌ప్లాజా చిరు వ్యాపారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఏర్పాటు చేయబడింది. అంతే కాకుండా నగరంలోని ప్రధాన సెంటర్లలో రోడ్డు పక్కన ఏర్పాటు చేస్తున్న టిఫిన్లు, ఇతర ఫాస్ట్‌ఫుడ్ వ్యాపారాల వల్ల రోడ్డుపై రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఖాతాదారుల వాహనాలతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో అర్బన్ ఫుడ్‌ప్లాజాతో ఇలాంటి సమస్యలు లేవు. విశాలమైన పార్కింగ్, మెరుగైన లైటింగ్ వ్యవస్థ ఇక్కడ ఏర్పాటు చేసినట్లు నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నారు.

> **ఆహ్లాదకరం**
>
> ఆహ్లాదకరమైన వాతావారణంలో అర్బన్ ఫుడ్ ప్లాజా ఏర్పాటు చేశారు. ఇక్కడి రకరకాల స్టాళ్ల వద్ద పిల్లలను ఆకట్టుకునేలా బొమ్మలు ఉన్నాయి. చిన్నారులు ఇక్కడ ఆనందంగా గడుపుతున్నారు. వెజ్ అండ్ నాన్‌వెజ్‌కు సంబంధించిన అన్నిరకాల పదార్థాలు ఇక్కడ దొరుకుతున్నాయి. ధరలు కూడా అందుబాటులో ఉన్నాయి.
>
> – ఆసిఫ్ బాషా

తలసేమియా చిన్నారుల వైద్యానికి కృషి

రాజమహేంద్రవరం సిటీ: తలసేమియా చిన్నారులకు 'బోన్ మేరో ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్‌కు కావాల్సిన ఆర్థిక, వైద్య సహాయం విషయంలో తనవంతు కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ భరత్ రామ్ అన్నారు. ఆదివారం స్థానిక గోదావరి గట్టు వద్ద గల త్యాగరాజ కళాక్షేత్రంలో జైన్ సేవాసమితి ఆధ్వర్యంలో సంకల్ప్ ఇండియా ఫౌండేషన్ (బెంగళూరు) నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీ భరత్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. తలసేమియా బాధితులకు సీఎం జగన్ నెలకు రూ.10 వేల పింఛన్ అందజేస్తున్నారన్నారు. ఎంతమందికి ఆపరేషన్ చేయడానికి అవకాశం ఉందో వైద్య నివేదికలు అందజేస్తే అటు ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వంతోనూ, ఇటు మన ముఖ్యమంత్రి జగనన్నతోనూ మాట్లాడి సాధ్యమైనంత మేర ఆర్థిక వనరులు సమకూర్చేందుకు కృషి చేస్తానన్నారు. బాధితుల ఆరోగ్యం, వారి జీవితంలో వెలుగులు నింపేందుకు నిర్వాహకులు విక్రమ్ జైన్, బెరూలాల్ బృందం చేస్తున్న కృషిని అభినందించారు. సీఆర్ఎంఎఫ్‌కు సిటిజన్ ఆసుపత్రికి టైఅప్ ఉందని, బోన్ మేరో ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రుడాచైర్‌పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి, డాక్టర్ అనసూరి పద్మలత పాల్గొన్నారు.

గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలి



పేపర్ మిల్లు ఎదుట రిలే నిరాహార దీక్షలో కూర్చున్న కార్మికులు

ప్రకాశం నగర్: పేపరుమిల్లు గుర్తింపు సంఘం ఎన్నికలను తక్షణమే జరపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమ రాజ్ డిమాండ్ చేశారు. పేపర్ మిల్లు కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం 12వ రోజుకు చేరుకున్నాయి. దీక్షకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరం బాబు, జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమరాజు, జిల్లా గ్యాస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గంటి కృష్ణ, కోరమండల్ కాంక్రీట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.రవి మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ 12 రోజులుగా ఏపీ పేపర్ మిల్లు కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాటం సాగిస్తున్నా.. యాజమాన్యం చలనం లేకుండా మొండిగా వ్యవహరిస్తోందన్నారు. యాజమాన్యం గుర్తింపు ఎన్నికలు వెంటనే జరపాలని, క్యాంటీన్ రేట్లను తక్షణమే తగ్గించాలని, కాంట్రాక్టు కార్మికులను సినియారిటీ ప్రకారం పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో ఎంవీ రావు, డి.బ్రహ్మం, ఎస్.శ్రీనివాస్, డి.నాగరాజు, బి.రమణ కూర్చున్నారు.

నర్సరీని సందర్శించిన ప్రొఫెసర్ల బృందం



ప్రొఫెసర్ల బృందానికి స్వాగతం పలుకుతున్న పుల్లా చంటియ్య

కడియం: కడియపులంకలోని పుల్లా చంటియ్యకు చెందిన సత్యదేవ నర్సరీని కర్ణాటక, ఒడిశాలకు చెందిన ప్రొఫెసర్ల బృందం ఆదివారం సందర్శించింది. ఒడిశాలోని భువనేశ్వర్‌కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ రవి ప్రసాద్ నేతృత్వంలో కర్ణాటకలోని పుత్తూరుకు చెందిన జీడిమామిడి పరిశోధనా కేంద్రం ప్రొఫెసర్లు నర్సరీల సందర్శకు విచ్చేశారు. ఈ బృందంలో ఐసీఏఆర్ డైరెక్టర్ డాక్టర్ దినకర్, ప్రిన్సిపల్ శాస్త్రవేత్త టి.రవిప్రసాద్, ఒడిశాకు చెందిన ప్రొఫెసర్ బీసీ లింకన్, శాస్త్రవేత్త మోహన్, డాక్టర్ సీఆర్ సేతుపతి ఉన్నారు. వీరికి నర్సరీలోని వివిధ జాతుల మొక్కల గురించి నర్సరీ అధినేత పుల్లా పెదసత్యనారాయణ వివరించారు. అంతకు ముందు ఈ బృందానికి నర్సరీ రైతులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో డాక్టర్ పుల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవార్డుతో బాధ్యత మరింత పెరిగింది



అబ్దుల్ కలాం అవార్డు అందుకుంటున్న కార్తిక్ సింగంపల్లి

సీటీఆర్ఐ: అబ్దుల్ కలాం అవార్డు రావడం తన బాధ్యతను మరింత పెంచిందని ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ కార్తిక్ సింగంపల్లి అన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన ఆయన ఓయాసిస్ వరల్డ్ రికార్డ్స్ సాధించి అత్యంత అరుదైన గుర్తింపును పొందారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ విభాగాల్లో కృషి చేసిన వారిని నామినేట్ చేసి ఫైనల్ విజేతలకు అవార్డులు అందించే ఓయాసిస్ వరల్డ్ రికార్డ్స్‌కు ఈ ఏడాది అత్యంత ప్రభావంతమైన సామాజిక ఉద్యమ విభాగంలో 2,620 మంది పోటీపడ్డారు. వారిలో ఏపీజే అబ్దుల్ కలాం అవార్డును కార్తిక్ సింగంపల్లి సొంతం చేసుకున్నారు. ఈ అవార్డును ఆదివారం ఉదయం ఢిల్లీలో జరిగిన ఓయాసిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రదానోత్సవంలో ఏడు ప్రపంచ దేశాల ప్రతినిధుల సమక్షంలో అందుకున్నారు. ఇటీవలే మలేసియా ఇంటర్నేషనల్ అంతర్జాతీయ స్థాయిలో ప్రదానం చేసే గౌరవ డాక్టరేట్‌ను అందుకుని, అత్యంత పిన్నవయసు కలవాడిగా రికార్డు నెలకొల్పారు. అనంతరం తన పుట్టినరోజు సందర్భంగా దేశంలోనే అత్యంత ఎత్తైన హిమాలయా పర్వత శిఖరం రియా పర్కిల్‌పై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటి సాహస యాత్రికుడిగా అందరి ప్రశంసలు అందుకున్నారు.

ఏఎన్నార్‌కు నివాళి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, పద్మభూషణ్, పద్మవిభూషణ్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు 9వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పలువురు నివాళులర్పించారు. అక్కినేని అభిమాని అడబాల మరిడయ్య ఆధ్వర్యంలో శ్రీపాద జిత్‌మోహన్‌మిత్రా నివాసంలోని మిత్రా కళావేదిక దగ్గర అక్కినేని చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జేసీఐ జాతీయ పూర్వ ఉపాధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మాట్లాడుతూ సినీ రంగానికి ఎన్టీఆర్, ఏఎన్నార్ రెండు కళ్లు లాంటివారన్నారు. జిత్‌మోహన్‌మిత్రా మాట్లాడుతూ రోజులు మారాయి చిత్రం శ్యామలా థియేటర్‌లో వంద రోజులు ఆడడమే కాకుండా ఇక్కడే శత దినోత్సవం చేసుకుందన్నారు. అడబాల మరిడయ్య మాట్లాడుతూ ఎన్టీఆర్, ఏఎన్ఆర్ సినిమా ఇండస్ట్రీకి పెద్ద దిక్కుగా ఉండేవారన్నారు. అక్కినేని అభిమాన సంఘం అధ్యక్షుడు అనిశెట్టి ఆనంద్, పిచ్చుక అచ్యుత రామయ్య, ఎం.శేషగిరిరావు పాల్గొన్నారు.

రజకుల సంక్షేమానికి సీఎం జగన్ కృషి



బల్లల పండగలో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్



కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే రాజా, కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

- ఎంపీ భరత్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- సంప్రదాయబద్ధంగా బల్లల పండగ

సీటీఆర్ఐ: రజకుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలా కృషి చేస్తున్నారని రాజమహేంద్రవరం ఎంపీ భరత్‌రామ్, రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరం టౌన్ రజక వర్తక సంఘం ఆధ్వర్యంలో స్థానిక శేషయ్య మెట్ట వద్ద ఉన్న రజక కమ్యూనిటీ హాల్లో రజకుల బల్లల పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎంపీ భరత్ రామ్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రజకులు దైవంగా భావించే రాతి బల్లకు కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ సీఎం జగనన్న లోక్‌సభ స్థానాన్ని బీసీలకు కేటాయించి మీ అందరి తరఫున తనను పార్లమెంట్‌కి పంపారన్నారు. ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ప్రతి ఏడాది సంక్రాంతి తర్వాత రజకుల బల్లల పండగను వైభవంగా నిర్వహించుకుంటారన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం టౌన్ రజక సంఘం ప్రెసిడెంట్ శీలం శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు పాలమూరి వెంకటరావు, వైస్ ప్రెసిడెంట్ దేవర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజీవ్ కాలనీలో తాటాకిల్లు దగ్ధం



బాధితులకు సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: మండలంలోని వేమగిరి తోటలోని రాజీవ్ నగర్ కాలనీలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో కుడిపూడి నాగమణికి చెందిన తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. నాగమణి కుటుంబంతో పాటు, కుమారుడి కుటుంబం కూడా ఈ ఇంట్లోనే నివాసం ఉంటున్నాయి. కూలి పనిచేసుకునే వీరంతా ఉదయాన్నే పనులకు వెళ్లిపోయారు. సుమారు పదిన్నర గంటల సమయంలో ఉన్నట్టుండి ఇంట్లో మంటలు చెలరేగాయని బాధితులు తెలిపారు. చూస్తుండగానే ఇల్లు మొత్తం కాలిబూడిదైపోయిందన్నారు. ఈ ప్రమాదంలో సుమారు లక్షన్నర రూపాయల విలువైన సామగ్రి కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంటలు చెలరేగడాన్ని గమనించిన స్థానికులు చుట్టుపక్కల ఇళ్లకు వ్యాపించకుండా ఆర్పివేశారు. ప్రమాద ఘటన విషయం తెలుసుకుని వివిధ పార్టీల నాయకులు బాధితులను పరామర్శించారు.

బాధితులకు చందన నాగేశ్వర్ సాయం

అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ సాయం అందజేసారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఆ కుటుంబానికి ఆర్థిక సాయంతో పాటు నిత్యావసరాలు అందజేశారు. ఇల్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కట్టా జమీందారు, గుబ్బల నాగార్జున, నరాల శ్రీను, పితాని శ్రీను, పితాని హరి, శ్రీధర్ జాన్‌బాబు, రెవిన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బుచ్చయ్య పరామర్శ

వేమగిరితోట రాజీవ్ కాలనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో రోడ్డున పడిన బాధితులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఆదివారం ఆయన బాధితులను పరామర్శించారు. తన వంతు సాయం చేస్తానన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాస్, గుత్తుల కృష్ణ ఉన్నారు.

ట్రైనింగ్ కాలేజీ అభివృద్ధికి కృషి



ఓల్డ్‌బాయ్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ప్రభుత్వ ట్రైనింగ్ కాలేజీని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామని ఓల్డ్ బాయ్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు అన్నారు. అసోసియేషన్ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం ట్రైనింగ్ కళాశాలలో జరిగింది. అధ్యక్షుడు చింతపెంట ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు తోడ్పడాలని తీర్మానించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎన్నిక జరగగా, ప్రస్తుత కార్యవర్గమే మరో రెండేళ్లు కొనసాగించేలా ఏకగ్రీవంగా తీర్మానించారు. మరో నలుగురిని కొత్తగా కార్యవర్గంలోకి తీసుకున్నారు. కోఆప్షన్ సభ్యులుగా గన్ని కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్‌లను తీసుకోవాలని నిర్ణయించారు.

కార్యవర్గ సభ్యులు

అధ్యక్షుడిగా చింతపెంట ప్రభాకరరావు, కార్యదర్శిగా చెక్కా త్రినాథ్, కోశాధికారిగా సమయమంతుల సాయి, ఉపాధ్యక్షుడిగా ఇన్నమూర్తి రాంబాబు, సంయుక్త కార్యదర్శిగా నాగం రవికిషోర్, కన్వీనర్‌గా కె.విటోభా మహరాజ్, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ పిల్లాడి పరమహంస, కందుల బుచ్చిరామ్, ఎస్.భావన్నారాయణ, ఎం.శ్యామలరావు, వాకా శ్రీనివాసరావు, ఏవీవీ అచ్యుత రమణ, ఎస్ఎస్ వెంకట చలం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే కె.సత్యనారాయణమూర్తి (నిప్పుమూర్తి), డి.భగవాన్‌దాస్, శ్యామ్‌సింగ్, ఎం.వేణుగోపాల్‌ను కొత్తగా కార్యవర్గంలోకి తీసుకున్నారు.

ముస్లింలకు నిరంతరం అండగా ఉంటాం

- జక్కంపూడి రాజా, భరత్ రామ్
- మదర్సా విద్యార్థులకు పట్టాల ప్రదానం



మాట్లాడుతున్న జక్కంపూడి రాజా, చిత్రంలో కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్



మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్ రామ్

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిరంతరం ముస్లింలకు అండగా ఉంటోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. కొంతమూరు జామియా సిద్ధిఖియా నూరుల్ ఉలుమ్ మదర్సా ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన దస్తార్ బందీ కార్యక్రమానికి జక్కంపూడి రాజా, భరత్ రామ్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మదర్సాలో దివ్యఖురాన్‌ను కంఠస్థం చేసిన 24 మంది విద్యార్థులకు హాఫీజ్ ఖుర్ఆన్ పూర్తయిన సందర్భంగా విద్యాప్రవీణులుగా సత్కరించి అర్హతా పత్రాలను అందజేశారు. జక్కంపూడి రాజా మాట్లాడుతూ సర్వమానవాళికి ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించడమే ఇస్లాం ధర్మమన్నారు. మనదేశంలో ముస్లింలు నిర్మాణాత్మక భాగస్వాములని, వారికి అన్ని రంగాల్లోనూ సమ ప్రాధాన్యాన్ని అందించేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ కొంతమూరులో రోడ్డుపై ఉన్న మదర్సా నిర్మాణానికి ఎంతో మంది శంకుస్థాపనలు చేయడం తప్పిస్తే ముందడుగు పడలేదని, రూ.25 లక్షలతో పూర్తి చేయనున్నట్టు తెలిపారు. వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ముస్లింలకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ ఆరీఫ్ మాట్లాడారు. ఇషాతుల్‌ఖైర్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అహ్మద్ అబ్దుల్లా తొయ్యుబ్ సాహెబ్ దావంత్ బరకాతుహూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మదరసా ప్రతినిధి మహ్మద్ ఫాయామ్ ఆజమ్ ముఫ్తీ, సయ్యద్ సాజిద్, మస్జిద్ ప్రెసిడెంట్ షేక్ మౌలా, జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ ఎంఎం అలీ, షేక్ చానా, సయ్యద్ సలీం, పటాన్ కాశీంబాషా, షేక్ అస్లం తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ట్రాన్స్‌జెండర్ ప్రేమికుడు!

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పెళ్లి చేసుకుంటానని ట్రాన్స్‌జెండర్‌ను నమ్మించి, ఆమె ఆత్మహత్యకు కారకుడైన ప్రేమికుడు పట్టా శ్రీనును ఆదివారం త్రీటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. సింహాచలనగర్‌కు చెందిన పట్టా శ్రీను ట్రాన్స్‌జెండర్ ప్రణీతను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి నాలుగేళ్లుగా ఆర్థిక అవసరాలు తీర్చుకున్నాడు. ఇటీవల మరో ట్రాన్స్‌జెండర్‌తో ప్రేమాయణం సాగిస్తున్నాడు. దీంతో ప్రణీత పెళ్లి చేసుకోవాలని అడగ్గా ముఖం చాటేశాడు. దీంతో మనస్తాపం చెందిన ప్రణీత శనివారం ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన త్రీటౌన్ పోలీసులు నిందితుడు పట్టా శ్రీనును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.